క్లుప్తంగా

ఎస్పీకి శుభాకాంక్షలు

మహబూబ్‌నగర్ క్రైం: కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్పీ డి.జానకిని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు ఉన్నారు. అనంతరం జోగులాంబ జోన్–7 డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్‌తో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎస్పీ డి.జానకిని శుక్రవారం సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడు జగపతిరావు, ప్రధాన కార్యదర్శి నాగభూషణం, సురేష్‌బాబు, రాజసింహుడు పాల్గొన్నారు.



నందిపేట బస్సును పునరుద్ధరించాలి

అడ్డాకుల: మూసాపేట మండలం నందిపేట గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మహబూబ్‌నగర్‌లో ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. గతంలో తమ గ్రామానికి దేవరకద్ర నుంచి ఆర్టీసీ బస్సు వచ్చేదని వివరించారు. జనవరిలో డోకూర్ వద్ద రైల్వే బ్రిడ్జి పనులు మొదలైన వెంటనే బస్సును రద్దు చేశారని, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నందున తిరిగి ప్రారంభించాలని కోరారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సైతం ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారని వివరించారు. రాంరెడ్డి, శ్రీకాంత్, రాజ్‌కుమార్, బలిజ రవికుమార్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జడ్చర్ల: బాదేపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని నేతాజీ చౌక్, గౌరీశంకర్ కాలనీ, సిగ్నల్‌గడ్డ, కల్వకుర్తి రోడ్, దేవి టాకీస్‌రోడ్, సరస్వతీ కాలనీ, వెంకటేశ్వర కాలనీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిమ్మబాయిగడ్డ, ఫిరోజ్‌నగర్, ఎర్రసత్యం కాలనీ, మార్కెట్‌యార్డ్, ఎస్‌వీపీ నగర్, వంశీ ఆస్పత్రి ఏరియాల్లో విద్యుత్ నిలిపివేస్తామని వివరించారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంలో భాగంగా చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు.

ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి

జడ్చర్ల టౌన్: ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి శివకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేటికి విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవటం సరికాదన్నారు. వెంటనే మంత్రిని నియమించి విద్యా వ్యవస్థను చక్కదిద్దాలని కోరారు. ప్రైవేట్ యాజమాన్యాలు పుస్తకాల పేరుతో వ్యాపారం నిర్వహిస్తూ రూ. వేలు వసూలు చేస్తున్నాయని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నోట్ పుస్తకాల అందజేత

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ గ్రామానికి చెందిన ఎండీ సైఫ్ శుక్రవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు దయానంద్ విద్యామందిర్ విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. మొత్తం 150 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో డా. పాష, ఇంతియాజ్, రహమత్, జహంగీర్, మున్ను, అశ్రఫ్, కలీం, ఇమ్రాన్, సోహేల్, అయాజ్ తదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యం కేసునమోదు

భూత్పూర్: మండలంలోని తాటికొండకి చెందిన లక్ష్మి అదృశ్య మైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు సదరు యువతి ఇంటర్ వరకు చదివి ఇంటిదగ్గరే ఉండేది. గురువారం పని నిమిత్తం గ్రామంలోని స్కూల్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగిరాలేదు. ఎంత వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో ఆమె తల్లి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఉచితవిద్య అందించాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ : ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలని కోరుతూ టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఐఈఓ శ్రీధర్ సుమన్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు గోపాల్, మెట్టుకాడి ప్రభాకర్, ఆశన్న, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



మిడ్జిల్‌లో..



నవాబుపేటలో..



జిల్లాకేంద్రంలో ప్రేమ్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో..



జిల్లాకేంద్రంలో మాట్లాడుతున్న కృష్ణారావు

సాధన చేస్తే ఆరోగ్యయోగం



గూరకొండలో..



వెన్నాచేడ్‌లో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. జిల్లాకేంద్రంలో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బెక్కరి రాంరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడారు. నిత్యం యోగా సాధన చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. జోనల్ కోఆర్డినేటర్ కృష్ణారావు యోగా, ధ్యానం గురించి వివరించారు. ట్రైనర్ నీలిమ, ఆశ్రమ మేనేజర్ నర్సిములు, ప్రభు తదితరులు పాల్గొన్నారు. ప్రేమ్స్ యోగా హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమలో వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రేమ్ కుమార్, స్థానిక మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో యోగాడే నిర్వహించారు.

- జడ్చర్ల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య పాల్గొని మాట్లాడారు. యోగాతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డా.శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఫెలైవాక్ అసోసియేషన్ కన్వీనర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జడ్చర్ల జూనియర్ సివిల్ జడ్జికోర్టు ప్రాంగణంలో కార్యక్రమంలో.. సంజీవ్ గురూజీ ఆసనాల ప్రాముఖ్యత వివరించారు. న్యాయవాదులతో ఆసనాలు చేయించారు. న్యాయమూర్తులు లక్ష్మి, బుద్దాసిర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య పాల్గొన్నారు. అనురాగిణి ఆశ్రమంలో సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ యోగా చేసిన చిన్నారులను సత్కరించారు.
- దేవరకద్ర మండలంలోని గూరకొండ పాఠశాలలో విద్యార్థులు యోగా విన్యాసాలతో అలరించారు.
- చిన్నచింతకుంట పరిధిలో కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్, మండల అధ్యక్షుడు దశరథ్, చంద్రుడు, శేఖర్, వెంకటేష్, శంకర్, శివ, శంకరయ్య, శ్రీనివాసులు, నరసింహులు, మధు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పీయూలో..

పాలమూరు యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్ చంద్రకిరణ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, రామ్మోహన్, పీఆర్వో రవికుమార్, శివకుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నచింతకుంటలో..

- మహమ్మదాబాద్‌లోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో యోగాడే నిర్వహించారు.
- మిడ్జిల్‌లో పరిధిలోని అన్ని పాఠశాల్లో కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు రామంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- గండేడ్ పరిధిలోని వెన్నాచేడ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రకాంత్, పీడీ నాగమణి, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, వనపలి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.
- నవాబుపేట పరిధిలోని మరికల్, నవాబుపేట, ఇప్పటూర్ పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో జాతీయ స్థాయి అవార్డు గ్రహీత పురుషోత్తం యోగా కార్యక్రమాలు నిర్వహించారు.



దోకూర్‌లో..



పీయూలో ఆసనాలు వేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



మహమ్మదాబాద్‌లో..



జడ్చర్లలో ఆసనాలు వేయిస్తున్న శిక్షకుడు

మెరుగైన విద్య అందించాలి



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రశాంతినికేతన్ నూతన పాఠశాలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఎంఎస్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డైరెక్టర్ అనిల్‌కుమార్, అడ్వైజర్ మురళీధర్ పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా క్రమ శిక్షణతో మెలగాలన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు అక్రమ్, రాజశేఖర్, శ్రీనివాసులు, బాబర్, బిక్షపతి, అంజప్ప, సతీష్, ఎల్లప్ప, సుగుణ, మల్లేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టర్ విజయేందిరకు నోటు పుస్తకాలను అందజేస్తున్న సంఘం నాయకులు

ఆన్‌లైన్ మోసగాళ్ల వలలో చిక్కొద్దు



దేవరకద్ర: ప్రజలు ఆన్‌లైన్ మోసగాళ్ల వలలో చిక్కకుండా జాగ్రత్త పడాలని ఎస్ఐ నాగన్న సూచించారు. శుక్రవారం దేవరకద్ర పోలీసు స్టేషన్ వద్ద వివిధ గ్రామాలకు చెందిన ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. బ్యాంకుల పేరుతో, రుణాల మాఫీ, ధాన్యం అమ్మిన వారికి డబ్బులు వేస్తామని ఆధార్, పాన్‌కార్డు నెంబర్లు చెప్పమని, ఓటీపీ వస్తే నెంబర్ చెప్పమని కాల్ చేసే వారిని అసలు నమ్మవద్దని కోరారు. ఇక ఆస్తి తగాదాలు, భూముల పంచాయతీలు ఉంటే పోలీసులను లేక న్యాయస్థానాలను ఆశ్రయించాలని సూచించారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నీట్‌లో జరిగిన అక్రమాలను నిరసిస్తూ పాలమూరు యూనివర్సిటీలో ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) దిష్టిబొమ్మను ఏబీవీపీ నాయకులు శుక్రవారం దహనం చేశారు. ఈమేరకు నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. నాయకుడు కృష్ణకుమార్ మాట్లాడుతూ ఎన్టీఏను ప్రక్షాళన చేసి, బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. శివకుమార్, జైపాల్, నగేష్, వేణుగోపాల్, శశి, వేణు, శివ, శ్రీను పాల్గొన్నారు.



టీబీపై అవగాహన

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి ఫార్మసెజ్‌లోని ఎల్అండ్‌టీ శిక్షణ కేంద్రంలో సిబ్బందికి జిల్లా టీబీ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో వ్యాధిపై అవగాహన కల్పించారు. 2 వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం, ఆకలి లేకపోవటం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని డా.రఫీక్ వివరించారు. శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ దీపక్‌కుమార్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దోమల నివారణ కోసం శుక్రవారం స్థానిక 41వ వార్డు పరిధిలో ఫాగింగ్ చేపట్టారు. షాషాబ్‌గుట్ట, మర్లు తదితర ప్రాంతాలలో ప్రత్యేక వాహనం ద్వారా మున్సిపల్ సిబ్బంది ఈ కార్యక్రమం నిర్వహించారు.

వాసవీమాతకు పూజలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయంలో సామూహిక కుంకుమార్చన, లలితా పారాయణం చేపట్టారు. అనంతరం అమ్మవారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు



దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూర్ గ్రామంలో శుక్రవారం ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. గ్రామంలోని రైతులు ట్రాక్టర్లపై వచ్చి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు బాగా కురువాలని, పంటలు బాగా పండాలని కోరుతూ తమ టాక్టర్లతో ఆలయ మైదానంలో ప్రదక్షిణలు చేశారు. ఇతర వాహనదారులు సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధే ధ్యేయం



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్: తమ ప్రభుత్వంలో విద్య, వైద్యం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో దాతల సహకారంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్స్‌ను ప్రారంభించారు. దాతలు ముందుకు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. నియోజక వర్గంలో 55వేల మంది విద్యార్థులకు ఆగస్టు–15 వరకు ఉచితంగా బూట్లను పంపిణీ చేస్తామన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలలో మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీటీసీ గౌస్, మాజీ జెడ్పీటీసీ రబ్బానీ, ఎంఈఓ మంజులాదేవి, నోడల్ అధికారి వెంకటయ్య, హెచ్‌ఎం సరస్వతి నాయకులు పాల్గొన్నారు. .

విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలి

జడ్చర్ల: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. పరిష్కారంలో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని, రైతుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. తీరు మార్చుకోవాలని మందలించారు. రైతులను ఇబ్బందులు పెడితే సహించబోమన్నారు. వ్యవసాయ పొలాల్లో, ఇళ్లపైన వేలాడుతున్న లైన్లను గుర్తించి సరిచేయాలన్నారు. కరెంట్‌కోతలు లేకుండా చూడాలని, గృహజ్యోతి కింద జీరో బిల్లులు అమలు చేయాలన్నారు. నసరుల్లాబాద్, గొల్లపల్లి, జడ్చర్ల టౌన్, రంగారెడ్డి గూడ, నందారం, నేరళ్లపల్లిలో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. పెద్దాయపల్లి వద్ద 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో డీఈఈ కృష్ణమూర్తి, ఏడీఈలు శ్రీనివాసులు, తావుర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తిచేయాలి

భూత్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అమ్మ ఆదర్శ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఎంపీడీఓ ప్రభాకర్‌ను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని తాటికొండ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, మిషన్ భగరీథ నీరు, తరగతి గదులు తదితర సమస్యలపై ఆరా తీశారు. మిషన్ భగీరథ నీరు పాఠశాలకు సరఫరా అయ్యే విధంగా పైప్‌లైన్ నిర్మాణం పనులు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభమైనా ఇంకా అమ్మ ఆదర్శ పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘననివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జయశంకర్ ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే యెన్నం, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జయశంకర్ తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, రాములుయాదవ్, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు మంచి పేరు తేవాలి

క్రీడల్లో విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక క్రీడాశాఖ స్విమ్మింగ్‌పూల్‌లో వేసవి శిబిరంలో ఈత నేర్చుకున్న విద్యార్థులకు మెయిన్ స్టేడియం ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయస్థాయిలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్, మతిన్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు



జడ్చర్లలో..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయను జీవితం ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. మున్సిపల్ మాజీచైర్మన్ నర్సిములు, మాజీ వైస్ చైర్మన్ గణేష్, కౌన్సిలర్ రవికిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 13వ వర్ధంతిని శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు. బాదేపల్లి జెడ్పీహైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ పూలమాలలు వేశారు. వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. నివాళులు అర్పించారు.

ఇరువర్గాల ఘర్షణ

హన్వాడ: చిన్నదర్పల్లిలో శుక్రవారం ఇరువర్గాలు ఘర్షణ పడగా.. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. శివారులోని చిర్మల్‌కుచ్చతండాలో కేశావత్ రాములు, కేశావత్ రమేష్‌లకు తమ పొలం హద్దుల విషయంలో ఘర్షణ వాతావరణం చెలరేగింది. దీంతో ఓ వర్గానికి చెందిన వ్యక్తి కేశావత్‌రాములుకు మద్దతుగా వెళ్లాడు. దీంతో కట్టెలు, రాళ్లతో దాడిచేసుకున్నారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు ఇరువర్గాలపై కేసునమోదు చేశారు.